సాక్షి
జగిత్యాల

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



'డబుల్' పూర్తి చేసింది మేమే..'

జిల్లాకేంద్రం శివారు నూకపల్లిలో 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. -8లో▸



పారిశుధ్యంలో ముందుండాలి

ప్రత్యేక పారిశుధ్య పనుల్లో ఇబ్రహీంపట్నం మండలం జిల్లాలోనే ముందుండాలని జెడ్పీ సీఈవో రఘువరన్ అన్నారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ వేడిమి మరింత పెరిగే అవకాశముంది. రాత్రివేళ ఉష్ణోగ్రత పెరగనుంది.

న్యూస్‌రీల్

మల్యాల ప్యాక్స్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



జిల్లా సహకార అధికారికి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇస్తున్న డైరెక్టర్లు

మల్యాల: మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డిపై జిల్లా సహకార అధికారికి అవిశ్వాస తీర్మానం నోటీసు అందించారు. ఈ మేరకు ప్యాక్స్ ఉపాధ్యక్షురాలు మ్యాక బుజ్జమ్మ, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, యాళ్ల అనంతరెడ్డి, ఓరుగంటి రాజేందర్‌రెడ్డి, ఉత్తూరి తిరుమలేశ్, అడువాల సురేశ్, ఆకుల నగేశ్ బుధవారం జిల్లా సహకార శాఖ అధికారిని కలిసి అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి, నోటీసు అందజేశారు.

బైపాస్ రోడ్ సర్వేను అడ్డుకున్న రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

కోరుట్ల: కోరుట్ల పట్టణ శివారులోని సంగెం రోడ్డు వెంబడి బైపాస్ రోడ్ కోసం సర్వే చేస్తుండడంతో రైతులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు పసుల కృష్ణప్రసాద్, ఆ ప్రాంత రైతులు వనపర్తి చంద్రమోహన్, తోట రాజు, పసుల రాంగోపాల్ మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులూ లేకుండా బైపాస్ రోడ్ సర్వేకు అధికారులు రావడం విడ్డూరంగా ఉందన్నారు. సాగు భూముల నుంచి రోడ్డు సరికాదన్నారు. గతంలో ఉన్న బైపాస్ అలైన్‌మెంట్‌ను మార్చి తమ పొలాల్లో హద్దులు పెట్టడం వెనక కారణలేమిటని ప్రశ్నించారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేకుంటే జాతీయ రహదారి సర్వే సాగనివ్వబోమన్నారు. ఆర్డీవో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్ల క్రితం రైల్వేలైన్ వేయడానికి తన రెండెకరాలు తీసుకున్నారని, ఇప్పుడు బైపాస్ కోసం మరో రెండెకరాల్లో హద్దులు పెడుతున్నారని, బైపాస్ రోడ్డు లైన్ మార్చి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని తోట రాజు తెలిపారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారి సర్వేయర్లు వెనుదిరిగారు.


గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించండి



వేణుగోపాల్‌కు లేఖ అందిస్తున్న భీమ్‌రెడ్డి

జగిత్యాలక్రైం: రానున్న బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలని, అలాగే గల్ఫ్ దేశాల్లో పర్యటించాలని బుధవారం టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐసెల్ కన్వీనర్ మంద భీమ్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఆయనను సచివాలయంలో కలుసుకున్నారు. సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీతో కూడిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి




సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఎండగట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ముక్రం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న పెద్ద ఎత్తున బంద్ చేపడుతున్నామని, ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం కార్యదర్శి రామిల్ల రాంబాబు, ఏఐటీయూసీ నాయకులు కిరణ్, మహేశ్, దేవదాస్, రమేశ్, రాములు, అతిక్, ధర్మయ్య, సమీర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బల్దియాల్లో జీఐఎస్

- ఆధునిక సాంకేతికతతో పరిశీలన
- ప్రతి ఇంటి వివరాలు నమోదు
- కచ్చితత్వానికి అవకాశం
- డాటా సేకరిస్తున్న ఎంఎన్ ఏజెన్సీ



జగిత్యాల వ్యూ

జగిత్యాల: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం వంటి వివరాల కచ్చితత్వం కోసం ప్రభుత్వం జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సాంకేతికతను ఉపయోగిస్తోంది. ఈ మేరకు అధికారులు జిల్లాకేంద్రంలో సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అన్ని మున్సిపాలిటీల్లో జీఐఎస్ సిస్టమ్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బందితో ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉండగా.. ముందుగా జగిత్యాల బల్దియా అధికారులు ఈ డాటా సేకరణకు ఓ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు ఏజెన్సీ మున్సిపాలిటీలోని భవన నిర్మాణాల సంఖ్య, అనుమతులతో నిర్మించారా..? లేదా వరద కాలువలు, రహదారులు ఉన్నాయా..? ఎన్ని నల్లాలున్నాయి..? తాగునీటి మార్గాలతోపాటు ఎన్ని అపార్ట్‌మెంట్లున్నాయి..? ఎన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లున్నాయి..? వాణిజ్య సముదాయాల తదితర సమగ్ర సమాచారం మొత్తం జీఐఎస్ సాంకేతికతతో గుర్తించనున్నారు. ఇది పూర్తయితే ప్రతిఇంటిని సమీపంనుంచి చూసినట్లు ఉంటుంది. మ్యాప్‌లో ప్రతి అంశాన్నీ పొందుపర్చనున్నారు.

అక్రమాలకు చెక్..

బల్దియాల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేసుకుంటే ఈ సాంకేతికతతో ఇట్టే తెలిసిపోనుంది. ఒక అంతస్తుకు అనుమతి తీసుకుని జీప్లస్, రెండు, మూడు అంతస్తులు కూడా నిర్మిస్తుంటారు. అలాంటి ఇళ్ల వివరాలన్నీ ఈ సాంకేతికతతో తెలియనున్నాయి. మరోవైపు అక్రమాలకు చెక్ పడే అవకాశముంది. గతంలో భువన్‌సర్వే మాదిరిగానే ఈసారి పూర్తిస్థాయిలో చేపడుతున్నారు. ప్రతి నిర్మాణం ఎంతమేర విస్తీర్ణంలో ఉంది..? ఎంత పరిధి ఉంది..? ఎన్ని చదరపు మీటర్లలో నిర్మించారో క్షుణ్ణంగా వివరాలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో క్లిక్ చేయగానే భవన నిర్మాణాలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. కొందరు మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఆస్తిపన్ను ఎగవేసిన దాఖలాలు అనేక ఉన్నాయి. తాజాగా మున్సిపాలిటీ రికార్డుల్లో ప్రతి నిర్మాణాన్ని ఇంటర్నెట్‌లో పొందుపర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్రస్థాయిలో చేపట్టే చర్యలపై అప్పటికప్పుడు నివేదికలు తయారుచేసి కొత్తగా నిర్మించే మురికికాలువలుగానీ, రోడ్ల పరిధి గానీ, పారిశ్రామికంగాగానీ ఎలా ఉండాలన్నది అక్కడి నుంచి వారు సైతం వివరిస్తుంటారు. ప్రతి ఇంటి నిర్మాణానికి డిజిటల్ డోర్ నంబరు ఇవ్వనున్నారు. ఫలితంగా ఇంటి అడ్రస్ ఈజీగా తెలిసిపోతుంది. ప్రస్తుతం బై నంబర్లతో అస్తవ్యస్తంగా ఉండటంతో ఏ ఇంటి నంబరైనా దొరకాలంటే ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం డిజిటల్ నంబర్ ఇవ్వడం ద్వారా అడ్రస్‌లు ఈజీగా దొరికే అవకాశం ఉంది. ప్రతి వార్డులో ఎన్ని రోడ్లున్నాయి..? మురికికాలువలు ఎన్ని ఉన్నాయి..? వీధి దీపాలు ఎన్ని ఉన్నాయి..? మౌలిక సదుపాయాలు ఏమున్నాయి..? వంటి డేటా సైతం సేకరిస్తున్నారు. జీఐఎస్ సిస్టమ్ ద్వారా చేపడుతున్న ఈ సర్వేతో మున్సిపాలిటీలకు ఆదాయం లభించే అవకాశముంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన డాటాను పూర్తిగా సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ డేటా సేకరించడానికి హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్ టెక్నాలజీకి అప్పగించారు.

బల్దియాలకు నిధులు

మున్సిపాలిటీలకు కేంద్రంగానీ, రాష్ట్రంగానీ ఏవైనా పథకాలు అమలు చేసినప్పుడు బల్దియా వివరాలు నెట్‌లో ఉంటే త్వరగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా స్మార్ట్‌సిటీ, అమృత్, స్వచ్ఛ సిటీ, ఇలాంటి పథకాలు అమలైతే మరిన్ని నిధులు మున్సిపాలిటీకి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేస్తున్నట్లు తెలిసింది.

జీఐఎస్ మ్యాపింగ్ చేస్తాం



జగిత్యాల మున్సిపాలిటీలో జీఐఎస్ ఆధారిత మ్యాపింగ్ చేస్తాం. ఈ సిస్టమ్ ద్వారా ఏజెన్సీ రోడ్లు, డ్రెయినేజీలు, డిజిటల్ డోర్‌నంబర్లు ఇలా అనేక వివరాలు సేకరిస్తుంది. దీని ద్వారా స్మార్ట్‌సిటీలో లేదా అమృత్ వంటి పథకాల్లో చోటు లభించే అవకాశాలుంటాయి.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లాకేంద్రం శివారు ధరూర్ ఎస్సీవాడలో బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని 380 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించామని, ప్రజల సహకారం, ఎస్‌హెచ్‌జీ, యూత్ భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేయాలని సూచించారు. పరిశుభ్రతపై ఇంటింటా అవగాహన కల్పించాలని, తాగునీటి సమస్యలను గుర్తించాలని, గ్రామపంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహాయంతో పరిష్కరించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు గుర్తించి మొక్కలు నాటాలన్నారు. తాగునీటిపైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతోపాటు పంచాయతీ అధికారులకూ అధికారం ఇస్తామన్నారు. ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, డీపీవో దేవరాజ్, ఎస్‌హెచ్‌జీ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఎస్‌లో ధర్మపురివాసికి బంగారు పతకం



విజయవాడలో బంగారు పతకం అందుకుంటూ..



తల్లిదండ్రులతో నవనీత కృష్ణ

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సమక్షంలో సన్మానం

ధర్మపురి: ఎంఎస్ (జనరల్ సర్జన్)లో ప్రతిభ కనబర్చిన ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కస్తూరి నవనీతకృష్ణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సమక్షంలో వైఎస్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బంగారు పతకం అందించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కస్తూరి వేణుగోపాల్, రాధ దంపతుల రెండో కుమారుడు నవనీతకృష్ణ చిన్నప్పటి నుంచే వైద్యరంగంపై మక్కువ పెంచుకున్నాడు. ఆయన పెద్దనాన్న, ధర్మపురికి చెందిన గుండె వైద్య నిపుణులు కస్తూరి శ్రీధర్ స్ఫూర్తితో కాకతీయ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ కళాశాలలో జనరల్ సర్జన్‌గా చేరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో న్యూరోసర్జరీ సూపర్ స్పెషాలిటీ కోర్సు చదువుతున్న ఆయన ఎంఎస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ప్రథమస్థానంలో నిలిచారు. వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో నవనీతకృష్ణ బంగారు పతకాన్ని అందుకున్నారు.

'నిజామాబాద్ ఎంపీ సీటు నాదే..'

- ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

జగిత్యాలటౌన్: పార్టీ సీనియర్ నాయకుడిగా.. క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా ఉన్న తనకు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోటీచేసే అవకాశాన్ని బీజేపీ కల్పిస్తుందని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి (ప్రభారి) అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు ఏసీఎస్.రాజు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులకు అహంకారం తగదని, బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయకుంటే ఎంతటి వారినైనా పక్కన పెడుతుందని పేర్కొన్నారు. పసుపు రైతు ఉద్యమంలో తాను క్షేత్రస్థాయిలో అనేక ఉద్యమాలు చేశానని గుర్తు చేశారు. రైతుల సంక్షేమానికి బీజేపీ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొందరు నాయకుల నిరంకుశధోరణితో పార్టీలో నాయకులు, కార్యకర్తలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని గుర్తుచేశారు. ప్రజాసంక్షేమం, జాతీయభావం కోసం పనిచేసేవారినే పార్టీ అభ్యర్థులుగా గుర్తిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తన సీనియారిటీ, సిన్సియారిటీని పరిగణనలోకి తీసుకుని ఎంపీ టికెట్ తనకే వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపెల్లి రవీందర్, ఎడమల వెంకన్న, నారాయణరెడ్డి, విద్యాసాకూర్, కిషోర్‌సింగ్, ఎర్ర శ్రీనివాస్, మాడిశెట్టి మల్లేశం, బిట్టు తదితరులు ఉన్నారు.

అధికారంలోకొచ్చేందుకు కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు

- ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యత ఇవ్వని కాంగ్రెస్
- కోటి ఎకరాలకు నీరందించిన ఘనత కేసీఆర్‌దే..
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి



మధుసూదనాచారిని సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: ప్రజలను నమ్మించి అధికారంలోకొచ్చేందుకు కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు ఆడిందని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ మర్చిపోయిందని, అంతులేని హామీలిచ్చి ఇప్పుడు అమలు చేసేందుకు వెనుకాడుతోందని విమర్శించారు. అప్పుల్లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమో రేవంత్‌రెడ్డి నిరూపించాలన్నారు. దావోస్ పర్యటనలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. పరిపాలనా సౌలభ్యం, అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ నూతన జిల్లాలను ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. నదీజలాలపై ముందు చూపుతో వ్యవహరించి కోటి ఎకరాలకు నీరందించిన ఘనత కేసీఆర్‌దేనని వెల్లడించారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని, ఇప్పుడు రాష్ట్రంలో ఏ పల్లె చూసినా పచ్చని అందాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలుచేయని ప్రభుత్వం టీఎస్‌ను టీజీగా.. తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిర్ణయం తీసుకోవడం ఏమిటని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధునాత ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, ఇతర అభివృద్ధి పనులు కాంగ్రెస్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాగ్దానాలపై వంద రోజులు ఓపికపడదామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఏఎంసీ చైర్మన్లు తదితరులున్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం

- వందశాతం ఫలితాలు లక్ష్యంగా ప్రణాళిక
- నిత్యం రెండున్నర గంటలపాటు తర్ఫీదు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు కృషి
- ఇంకా 42 రోజుల గడువు



మల్లన్నపేటలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

గొల్లపల్లి: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. పరీక్షలకు మరో 42 రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో ఫలితాలు సాధించేందుకు నిర్ణయించింది. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతే పునాది కావడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రత్యే చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నిత్యం రెండు గంటలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాకుండా.. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టుల వారిగా తర్ఫీదు అందిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వందశాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రభుత్వ హైస్కూళ్లు 187 ఉన్నాయి. ఇందులో మొత్తంగా 24,239 మంది చదువుతున్నారు. ఇక ధర్మపురి నియోజకవర్గంలో పరిశీలిస్తే.. గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మపురి, వెలటూర్, బుగ్గారం, ఎండపల్లి మండలాల్లో 47 హైస్కూళ్లు, మోడల్ స్కూళ్లు, నాలుగు, కేజీబీవీలు నాలుగు, మైనార్టీ పాఠశాల ఒకటి, జ్యోతీరావు బాపూలే ఒకటి చొప్పున మొత్తం 58 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 10వ తరగతి చదివే విద్యార్థులు 1,658 మంది ఉన్నారు. అన్ని సర్కారు బడుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ సన్నద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు అల్పాహారం..



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎంఈవో జమునాదేవి

పది పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అల్పాహారం కోసం ఈ ఏడాది ప్రభుత్వం నుంచి గ్రాంట్ విడుదల కాలేదు. అయినప్పటికీ విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఉండేలా ఆయా మండలాల విద్యాశాఖ చొరవ తీసుకుంటోంది. గత నెల జనవరి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు, దాతలు కొంతమేర నగదు వేసుకుని విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు సహకరిస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది పదో తరగతి. గతంలో పది పరీక్షలకు 11 పేపర్లు ఉండగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఏడు పేపర్లకు కుదించింది. ఒక్కో పేపరు పరీక్ష నిర్వహణ సమయం 3గంటలు ఉంటుంది. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి మాత్రమే గంటన్నర చొప్పున ఉంటుంది.

ఒత్తిడిని అధిగమించాలి

ఉపాధ్యాయులు పాఠ్యాంశబోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది ఎవరు పదికి పది గ్రేడ్ సాధిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థులు సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలు కూడా అందిస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు ఇలా..

విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటలపాటు ఒక సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి.. మధ్యాహ్నం 3గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4.30 నుంచి 6 వరకు రోజుకు మొత్తంగా రెండున్నర గంటలపాటు ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహించి సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు.

ప్రత్యేక క్లాస్‌లు



పదో తరగతి చదువుతున్న మేము ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటలు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పరీక్షలు పెడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తున్నారు. వంద శాతం ఫలితాలు సాధించేలా చొరవ తీసుకుంటున్నారు.

– అస్మిత, పదో తరగతి

చొరవ బాగుంది



ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసుల్లో పాల్గొంటున్న వారికి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. దాతలు సహకారం అందిస్తున్నారు. మాలాంటి విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ప్రత్యేక చొరవ తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రేరణ కలిగిస్తున్నారు.

– విగ్నేష్, పదో తరగతి

లక్ష్యం చేరుకోవాలి



మండలంలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఒక లక్ష్యాన్ని నిర్ణయించాం. ఆ మేరకు చేరుకోవాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. అందుకు తగ్గట్టుగానే ఉపాధ్యాయులు తమ ప్రయత్నాలు చేస్తూ ప్రత్యేక తరగతులపై దృష్టి సారిస్తున్నారు.

– జమునాదేవి, ఎంఈవో గొల్లపల్లి

క్లుప్తంగా

రెగ్యులరైజ్ చేయాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్

జగిత్యాల: వైద్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ ఎంప్లాయిస్ నాయకులు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ల్యాబ్ టెక్నీషియన్లు, అసిస్టెంట్లకు తక్కువ జీతం వస్తుందని, వెంటనే వీరందరికీ పీఆర్సీ ప్రకారం టీఏ, డీఏలు చెల్లించడంతోపాటు, సర్వీసును క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

11 నుంచి రాష్ట్ర విద్య, విజ్ఞానిక మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బోగ రమేశ్, ఉపాధ్యాయులు

రాయికల్: ఈనెల 11, 12 తేదీల్లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని నయాబజార్ స్కూల్ గ్రౌండ్‌లో రాష్ట్ర విద్య, విజ్ఞానిక ద్వితీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ అన్నారు. గురువారం రాయికల్ మండలం తాట్లవాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైజ్ఞానిక మహాసభల్లో చర్చిస్తామని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, లావణ్య, సాగరిక, శ్రీధర్, శ్రీదేవి, చంద్రకళ, రవి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

డీసీఆర్బీ సీఐగా బాధ్యతలు



ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ శ్రీనివాస్

జగిత్యాల క్రైం: జగిత్యాల డీసీఆర్బీ సీఐగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

చెరువులో వృద్ధుడి మృతదేహం

రాయికల్: పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) స్థానిక జన్మయ చెరువులో శవమై కనిపించాడని ఎస్సై అజయ్ తెలిపారు. మతిస్థిమితం సరిగా లేని ఆయన ఈనెల 4న ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెదుకుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి చెరువులో శవమై కనిపించాడని ఎస్సై పేర్కొన్నారు. చిన్న నర్సయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంధాలు.. బహుదూరం

- విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు
- చిన్నపాటి గొడవలతో దూరమవుతున్న బంధాలు
- పిల్లల భవిష్యత్‌పై ప్రభావం

- జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి కోసం బంధువులు అందరూ ఇంటికి వచ్చారు. కానీ.. ఆ యువతి మాత్రం సొంత అక్క భర్తతో వెళ్లిపోయింది. దీంతో ఆ రెండు కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. జరిగిన ఘటనతో కుటుంబసభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

- ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను బుగ్గారం మండలానికి చెందిన ఓ వ్యక్తికిచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు జన్మించారు. ఆ మహిళ గతేడాది చిన్ననాటి మిత్రుడితో కలిసి వెళ్లిపోయింది. ఫలితంగా ఆ చిన్నారులు తల్లిలేని వారయ్యారు. ఆమె భర్త నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు.

- ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన భార్యభర్తలు చిన్నపాటి తగాదాలతో ఇద్దరు పిల్లలు జన్మించాక.. విడాకులు తీసుకుని ఎవరి జీవితం వారు గడుపుతున్నారు. ఆ చిన్నారులు మాత్రం తల్లిప్రేమకు దూరమవుతున్నారు.



జగిత్యాలక్రైం: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉండేది. కానీ ఆ బంధాలు ప్రస్తుతకాలంలో బహుదూరమైపోతున్నాయి. ఒకప్పుడు అమ్మానాన్న, అన్న, తమ్ముడు, చెల్లె, బావ, అక్క, వదిన, మరుదలు, చిన్నమ్మ, చిన్నాన్న, పెద్దమ్మ, పెద్దనాన్న ఇలా బంధుత్వాలు బలంగా ఉండేవి. కుటుంబంలో ఎవరికి ఆపద వచ్చినా అందరం తామున్నామంటూ ధైర్యం చెబుతూ ఆదుకునేవారు. ఆత్మీయులు చనిపోతే ఆ కుటుంబానికి వెన్నంటి ఉండి వారిని ఓదార్చి మనోధైర్యం నింపేవారు. కానీ ప్రస్తుతం ఆస్తిపాస్తులు, చిన్నపాటి గొడవలతో బంధాలు దూరమవుతున్నాయి. ఆత్మీయులు లేక.. అయినవారు పట్టించుకోకపోవడంతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. కుటుంబాన్ని నెట్టుకొచ్చే వ్యక్తి లేకపోవడం.. పిల్లలను ఆరా తీసే తల్లి లేకపోవడం వంటి పరిణామాలు కొందరి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

రక్తబంధాలు కూడా దూరమే..

చిన్నపాటి కుటుంబ తగాదాలతో కుటుంబాన్నే వద్దనుకుని తన జీవితం తనకంటే అందరినీ వదిలివెళ్లి రహస్య జీవితాలు గడుపుతుండటంతో వారి రక్తసంబంధీకులు వారు కన్పించకపోవడంతో వారి ఆచూకీ లభించకపోవడంతో రక్తసంబంధీకుల మనోవేదన అంతాఇంతా కాదు. ఎక్కడున్నారో..? ఎలా ఉన్నారో..? అని ఒకపక్కన, ఇంటి వద్ద ఉన్న వారు కుటుంబాన్ని నెట్టుకురాలేక మరోవిధంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మానసిక వేదనతో రోజులు గడుపుతున్నారు.

బెస్ట్ అవలేబుల్ స్కూళ్లకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: 2024–25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవలేబుల్ స్కూల్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. బెస్ట్ అవలేబుల్ స్కూల్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతితోపాటు, రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ప్రతి విద్యార్థికి రూ.42 వేల చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. నాన్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు రెండు జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, రూ.28 వేలు చెల్లించనున్నట్లు వివరించారు. దరఖాస్తు ఫారాలు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో లభిస్తాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 29లోపు కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

పారిశుధ్యంలో ఇబ్రహీంపట్నం ముందుండాలి

జెడ్పీ సీఈవో రఘువరన్



మాట్లాడుతున్న రఘువరన్

ఇబ్రహీంపట్నం: ప్రత్యేక పారిశుధ్య పనుల్లో ఇబ్రహీంపట్నం మండలం జిల్లాలోనే ముందుండాలని జెడ్పీ సీఈవో రఘువరన్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక, పంచాయతీ అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల చివరి వరకు ఇంటిపన్నులు వందశాతం వసూలు చేయాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్న చోట ప్రైవేటు కూలీలతో పనులు చేయించాలన్నారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు. పాత ఇళ్లను కూల్చివేయాలని, పనికిరాని బావులను పూడ్చివేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలువలు శుభ్రం చేయడం లేదు

కొన్ని నెలలుగా మురికికాలువలు శుభ్రం చేయడం లేదని, దుర్వాసనతో దోమల బారిన పడుతున్నామని రఘువరన్‌కు ఇబ్రహీంపట్నం 8వవార్డుకు చెందిన గడసంద సునీత ఫిర్యాదు చేశారు. దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. మురికికాలువలు పరిశీలించిన రఘువరున్ పిచ్చిమొక్కలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి సాయినాథ్‌ను ఆదేశించారు. ఎంపీటీసీ తిమ్మణి రాములు, మాజీ సర్పంచు నేమూరి లత, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, నల్లూరి సాగర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రాల్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి కృషి



మాట్లాడుతున్న నారాయణ

మల్లాపూర్: చేపపిల్లల పంపిణీలో దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ చేయాలని పీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన గంగపుత్రుల సమావేశంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు తోపారపు రజనీకాంత్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు దేశవేణి రాజేశ్‌తో కలిసి మాట్లాడారు. ప్రతి జిల్లాకేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ చేస్తున్నట్లే చేపపిల్లల పంపిణీకి సంబంధించి నగదును మత్స్యకారులకు అందించాలన్నారు. గతంలో చేప పిల్లల పంపిణీలో జరిగిన అవినీతిపై కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్‌తో కలిసి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. ఈనెల 11న జిల్లా కేంద్రంలో గంగపుత్రుల మహాసభ ఉంటుందని, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రవీందర్, కల్లెడ గంగాధర్, రొడ్డ రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేసింది మేమే..

- చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి
- ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఎప్పుడూ సందర్శించలేదు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బీఆర్‌ఎస్ హయాంలోనే జిల్లాకేంద్రం శివారు నూకపల్లిలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, 520 ఇళ్లకు పూర్తిస్థాయిలో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. టీఆర్‌నగర్‌లో రూ.7 కోట్లతో సంప్ ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 4 వేల ఇళ్లకు రూ.14.80 కోట్లతో మిషన్ భగీరథ కింద పైప్‌లైన్లు వేశామన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఏనాడూ డబుల్ ఇళ్లను సందర్శించలేదని, ఇప్పుడొచ్చి మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. గతంలో ధరూర్ క్యాంప్‌లో 260 ఎకరాల స్థలం ఉన్నా వినియోగించుకోలేకపోయారని పేర్కొన్నారు. చల్గల్‌లో అవకాశం ఉన్నా స్వార్థపూరితంగా నూకపల్లిలో ఏర్పాటు చేశారని ఆరోపించారు. 42ఏళ్లలో జీవన్‌రెడ్డి పేదలకు ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తాము పక్కనబెట్టలేదని, అగ్గిపెట్టె వంటి ఇందిరమ్మ ఇళ్ల స్థానంలో పేదలు ఆత్మగౌరవంతో ఉండేలా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని స్పష్టం చేశారు. జేఎన్‌టీయూ, న్యాక్ కేంద్రం గుట్టల్లో ఏర్పాటు చేసిన జీవన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ సమయంలో కరోనాతో ఇబ్బంది పడినా చివరికి పూర్తిచేశామని, చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే సరిపోతుందని తెలిపారు. కొందరు అర్హులకు సాంకేతిక కారణాలతో ఇళ్లు రాలేదని, వారిని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లపై రాష్ట్రవ్యాప్తంగా బ్యాంక్‌లో ఉన్న రూ.3,920 కోట్ల రుణాలను మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దన్నారు. నూకపల్లిలో పూర్తిస్థాయిలో వసతులు లేకున్నా అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంచామని, జీవన్‌రెడ్డి హయాంలో ఓ దాత ఇచ్చిన భూమిని ఇప్పుడు ఆక్రమించారని, రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించారని తెలిపారు. ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఓట్ల రాజకీయం చేయవద్దని సూచించారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్, వొల్లం మల్లేశం, జగదీశ్, రాజ్‌కుమార్, గంగసాగర్, సింగారావు, అడువాల లక్ష్మణ్ ఉన్నారు.

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న రంగారెడ్డి

జగిత్యాలటౌన్: గుడిసెవాసులు, సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకుని నాయకులను భేషరతుగా విడుదల చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని టీఆర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని ఆర్నెళ్లపాటు పేదలు అక్కడే ఉన్నారని, వారికి సీపీఎం నాయకులు అండగా నిలిచారని తెలిపారు. అలాంటివారిపై కేసులు నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ నివేశనస్థలాలు ఇవ్వాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామని అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరాములు, అరుణజ్యోతి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వాసుదేవరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, జిల్లా నాయకులు రమేశ్, వెంకటచారి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన రాజు తనకు భూ సమస్య ఉందని, పరిష్కరించాలని స్థానిక విలేకరి రమణారెడ్డిని సంప్రదించాడు. అతను రూ.3 లక్షలు, ఆ భూమిలో వంద గజాలు ఇవ్వాలన్నాడు. దీంతో రాజు ముందుగా రూ.లక్ష ఇచ్చాడు. కానీ భూ సమస్య పరిష్కరించకుండానే రమణారెడ్డి మళ్లీ డబ్బులు కావాలని అడిగాడు. అంతేకాకుండా ఈ నెల 5న రాజు చంద్రంపేట నుంచి వేములవాడ వెళ్తుండగా బెదిరించి, కులం పేరిట దూషించి, హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రమణారెడ్డి మంగళవారం కోర్టులో లొంగిపోగా జడ్జి ఆదేశాల మేరకు అతన్ని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సివిల్ గొడవల్లో తలదూర్చి, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ



అల్లీపూర్‌లో బ్యాటింగ్ చేస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్/మల్లాపూర్/జగిత్యాలటౌన్: రాయికల్ మండలంలోని ఇటిక్యాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఒడ్డెరకాలనీవరకు, ఒడ్డెరకాలనీ నుంచి ఇటిక్యాల జూనియర్ కళాశాల వరకు రూ.1.50కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. అల్లీపూర్‌లో ఎంబేరి గంగారెడ్డి, లక్ష్మీ స్మారకార్థం నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, అల్లీపూర్ మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంబారి సురేశ్, ఇటిక్యాల ఎంపీటీసీ ఆద ఆదిరెడ్డి, బూసరవేని శ్రీనివాస్‌యాదవ్, జలేందర్‌రెడ్డి, కాటిపల్లి గంగారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ అన్నారు. మల్లాపూర్ మండలం రేగుంటలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, నాయకులు పొన్నం భూమానందం, ఆదిరెడ్డి, నిమ్మల జలంధర్, రాజు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరిస్తా

ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించిన ఎఫ్‌ఏలతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రమేశ్, గౌడికర్ శ్రీనివాస్, సదానందం, చంద సాగర్, మామిడాల మల్లేశం, కొలిపాక రాజు తదితరులు ఉన్నారు.

'వాగేశ్వరి'లో ఐసీటీ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో పేపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీటీ అకాడమీ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. సర్టిఫికెట్ కోర్స్ ఆన్ డాటా అనలిటిక్స్‌ను ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ గంగ్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాప్ 3 వారాలు కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌ఎస్‌వీఎన్.శర్మ, ఐసీటీ అకాడమీ తెలంగాణ హెడ్ బి.గోపాల్ హాజరై, మాట్లాడారు. ఐటీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇందుకు ఇలాంటి వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ కోర్సు మార్చి 21 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్పొరేట్ రంగంలో డాటా అనలిటిక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. టెక్నాలజీ ప్రాముఖ్యతకు అనుగుణంగా విద్యార్థులు శిక్షణ పొందాలన్నారు. కళాశాల సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, కళాశాల ఐసీటీ కో–ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సైబర్ సెల్ డీఎస్పీ రంగారెడ్డి

జగిత్యాల క్రైం: సైబర్ భద్రతపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ డీవీ.రంగారెడ్డి అన్నారు. సైబర్ జాగృత దివస్‌లో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా సైబర్ భద్రత, నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ఉపాధ్యాయులు కూడా తమ పాత్ర పోషించాలన్నారు.

సైబర్ నేరాల విషయంలో జాగ్రత్త

మెట్‌పల్లి: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు యాప్‌ల ఆధారంగా సైబర్ నేరాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఫోన్లకు వచ్చే ఓటీపీలను గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వెంకయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారమిత స్కూల్లో వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ పారమిత వరల్డ్ స్కూల్లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకను స్వస్తి పేరిట బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని సూచించారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, వినోద్‌రావు, రష్మిత, రాకేశ్, అనూకర్‌రావు, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, కో–ఆర్డినేటర్ నాగరాజు, ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో చిన్నారి కిడ్నాప్ కలకలం !

- చాక్లెట్ చూపించి ఎత్తుకెళ్లే ప్రయత్నం
- చేతిని కొరికి తప్పించుకున్న వైనం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినికి చాక్లెట్ ఆశచూపి కిడ్నాప్ చేసేందుకు యత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివే ఎనిమిదేళ్ల చిన్నారి ఉదయం ఇంటర్‌వెల్ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి తరగతిగది నుంచి బయటకొచ్చింది. తల్లిదండ్రుల మాదిరి ఒకరు పాఠశాల పరిసరాలకు చేరి చిన్నారిని రావాలంటూ చేతిలో చాక్లెట్ పట్టుకుని పిలవడంతో దగ్గరకెళ్లింది. చాక్లెట్ ఇచ్చినట్లే ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడంతో.. అప్రమత్తమైన చిన్నారి ఆ ఆగంతకుని చేతిని కొరికి స్కూల్‌లోకి పరుగెత్తింది. దీన్ని గమనించిన స్కూల్ పీఈటీ అక్కడికొచ్చిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. స్కూల్ పరిసరాల్లో సంచరించిన ఆగంతకులను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పామని విద్యార్థులకు యాజమాన్యం తెలిపిందని తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం జరిగిన విషయం తమకు తెలియదని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భయాందోళన చెందుతున్నట్లు తెలిసింది.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి మృతి



పరమేశ్వర్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైల్వే ఉద్యోగి మోడెం పరమేశ్వర్(56) రైలు కిందపడి మృతి చెందారు. మంచిర్యాల్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన పరమేశ్వర్ స్థానిక రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఇంకా రాలేదు. ఆయన మృతికి గల కారణాలు తెలియలేదు. జీఆర్పీ ఎస్సై సుధాకర్ ఆదేశాల మేరకు మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- విషం తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు

సిరిసిల్లక్రైం: అత్తారింటి వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్లలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవపూర్‌కు చెందిన బొమ్మగాని స్రవంతి(లాస్య)కి కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రావుల నాగరాజుతో 2018లో వివాహమైంది. నాగరాజు సిరిసిల్ల బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఆరేళ్ల పాప, రెండేళ్ల బాబు ఉన్నారు. భార్యభర్తలిద్దరే సిరిసిల్ల రాళ్లభావి వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. నాగరాజు మంగళవారం విధుల నిమిత్తం బయటకు వెళ్లాడు. లాస్య ఇంట్లోనే ఉంది. తర్వాత కొద్ది సేపటికి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన ఇంటి యజమాని వెంటనే నాగరాజుకు తెలిపాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను నాగరాజు ముందుగా సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాడు. లాస్య అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. అత్తారింటి వాళ్లు కొద్ది రోజులుగా అదనంగా రూ.10 లక్షలు కట్నం తేవాలని వేధించడంతోనే తన కూతురు విషం తాగిందని మృతురాలి తండ్రి బొమ్మగాని రాజేశం ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.